ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
గురువారం 6 నవంబరు 2025


కార్తీక పౌర్ణమి సందర్భంగా పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి ప్రత్యేక అభిషేకాలు


ద్వారకాతిరుమలలో ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు


ఏలూరు గాంధీనగర్ శివాలయంలో జ్వాలాతోరణంలో పాల్గొన్న భక్తులు

కార్తీక దామోదర.. పాహిమాం

బుధవారం కార్తీక పౌర్ణమి పర్వదినం.. జిల్లావ్యాప్తంగా శివ నామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. స్వామికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. కార్తీక నోములు నోచుకున్నారు. బ్రాహ్మణులకు దానాలు నిర్వహించారు. సాయంత్రం జ్వాలా తోరణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న విద్యాశంకర్

ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రోత్సాహం

» ఉద్యానశాఖ సీడీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ విద్యాశంకర్

ఏలూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (సీడీపీ) కింద ఉద్యాన పంటల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, కేంద్ర ప్రభుత్వం అధీనంలోని నేషనల్ హార్టికల్చర్ మిషన్ సహకారం అందిస్తోందని ఉద్యాన శాఖ సీడీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ విద్యాశంకర్ పేర్కొన్నారు. ఏలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉద్యాన పంటల క్లస్టర్ల అభివృద్ధి కార్యక్రమంపై జిల్లా ఉద్యానశాఖ అధికారులు రైతులతో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటికే పలు పంటల్లో సీడీపీ పథకం అమలుకు ప్రాథమికంగా అనుమతిలిచ్చామన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి డాక్టర్ షాజనాయక్, ఏపీఎంఐపి పీడీ ఎస్.రామ్మోహన్, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, నాబార్డ్ డీడీఎం టి.అనిల్‌కుమారి, ఎల్డీఎండీ నీలాద్రి, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు మునిసిపల్ కమిషనర్‌గా పీరయ్య



నూజివీడు టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మునిసిపల్ కమిషనర్‌గా కొత్రపాటి పీరయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సెక్రటేరియట్ ముఖ్య కార్యదర్శికి వ్యక్తిగత కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించిన ఆయన ఇప్పటి వరకు పనిచేసిన ఆర్.వెంకట్రామిరెడ్డి స్థానంలో బాధ్యతలను స్వీకరించారు. వెంకట్రామిరెడ్డి పురపాలక శాఖ కార్యాలయంలో రిపోర్టు చేశారు.

పోలవరంలో 7, 8 తేదీల్లో పీపీఏ భేటీ

అమరావతి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనుల పురోగతిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమీక్ష నిర్వహించనుంది. అథారిటీ చైర్మన్ అతుల్ జైన్ అధ్యక్షతన ఈ నెల 7, 8 తేదీల్లో ప్రాజెక్టు ప్రాంతంలో రాష్ట్ర జలవనరుల శాఖ అధికారులతో సమావేశమవుతుంది. పనులను పరిశీలిస్తుంది. నిర్దేశించుకున్న గడువుల్లోగా పూర్తిచేసే దిశగా పనులు జరుగుతున్నాయో లేదో తెలుసుకుంటుంది. డిజైన్ల ఆమోదం, తొలి దశ కాంటూరులో అంచనా వ్యయం రూ.30,346.95 కోట్లకు ఆమోదం, పీపీఏ ప్రధాన కార్యాలయం రాజమహేంద్రవరానికి తరలింపు వంటి అంశాలపై చర్చిస్తుంది.

ఎర్రజెండా అండతోనే భూపోరాటాలు

టి.నరసాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):ఎర్రజెండా అండతోనే భూ పోరాటాలు విజయవంతం అవుతాయని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్ తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం 32వ జిల్లా మహాసభలు టి.నరసాపురంలో బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా సభాస్థలం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ పేదవానికి రెండెకరాల భూమి పంపిణీ, పేదలకు ఉచిత విద్యా, వైద్యం, అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లా కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మామిడిని.. సాగు చేయలేం!


నూజివీడు ప్రాంతంలో ఆయిల్‌పామ్ సాగు

రెండు దశాబ్దాలకు పైగా నూజివీడుతో మామిడికి విడదీయరాని సంబంధం ఉంది. గత రెండు దశాబ్దాలుగా మామిడిలో నెలకొంటున్న అననుకూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో మామిడి రైతులు పంటకు క్రమేణా దూరమవుతున్నారు. ఇప్పటికే మామిడి రైతులు మామిడి తోటలను తొలగిస్తూ వాటి స్థానంలో మొక్కజొన్న, పత్తి, ఆయిల్‌పామ్, సాగుకు మొగ్గు చూపుతున్నారు.

(నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి)

» ఉద్యానవన పంటల వైపు రైతుల మొగ్గు
» మామిడి స్థానంలో పెరుగుతున్న ఆయిల్‌పామ్ పంట విస్తీర్ణం
» చర్యలు తీసుకోకుంటే భవిష్యత్‌లో పూర్తిగా కనుమరుగు

ఉమ్మడి కృష్ణ జిల్లా పరిధిలోని నూజివీడు డివిజన్‌లో ఉన్న నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి, చాట్రాయితో పాటు తిరువూరు,విస్సన్నపేట, ఎ.కొండూరు, రెడ్డిగూడెం తదితర మండలాల్లో 60 వేల హెక్టార్లలో మామిడి సాగులో ఉండేది. జిల్లాల పునర్వ్యవస్థీకరణ అనంతరం నూజివీడు డివిజన్‌ను ఏలూరు జిల్లాలో విలీనం చేయడంతో నూతన నూజివీడు డివిజన్‌లో నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, లింగపాలెం మండలాలను కలిపారు. దీంతో మామిడి విస్తీర్ణంలో ఉద్యానవన పంటల ప్రకారం మామిడిలో దాదాపుగా ఎటువంటి మార్పు జరగలేదు.

పెరిగిన ఖర్చులు.. చీడపీడల ఉధృతి

మామిడికి రైతు దూరం అవడానికి ప్రధాన కారణం పెరిగిన ఖర్చులు, చీడపీడల ఉధృతి. తొలుత తుట్టి పురుగు అనంతరం కొవిడ్ ప్రభావంతో వరుసగా రెండేళ్ల మార్కెట్ లేకపోవడం, అనంతరం కోడిపెను ఉధృతితో పంట నాణ్యత దెబ్బతిని వరుసగా రెండేళ్ల పంటకు సరైన మార్కెట్ లేకపోవడం వంటి కారణాలతో వరుస కష్టాలు బాట పట్టిన మామిడి రైతులు మామిడి తొలగింపు మరింత వేగవంతం చేశారు.ఫలితంగా నూజివీడు డివిజన్ పరిధిలో మామిడి గత చరిత్రగా మారిపోయే పరిస్థితి నెలకొంది. అధికారిక లెక్కల ప్రకారం ఉద్యానవన పంటల సాగులో పురోగతి కనిపిస్తోంది. మామిడి స్థానాన్ని ఆయిల్‌పామ్ పూరించడమే అని చెప్పవచ్చు. మామిడి సాగుకు పూర్వ వైభవం తీసుకువచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. మామిడిని దెబ్బతీస్తున్న చీడపీడల ఉధృతిని అరికట్టేందుకు పూర్తిస్థాయిలో ప్రయోగాలు చేపట్టడంతో పాటు నూజివీడు కేంద్రంగా మార్కెట్ ఏర్పాటు చేయాలని, మామిడి ఉప ఉత్పత్తుల పరిశ్రమలను ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

వరుస నష్టాలతో మామిడికి దూరం..



మామిడికి చీడపీడలతో వరుస నష్టాలు కనీసం కౌలు తీసుకునేందుకు కౌలు రైతులు ముందుకు రాని పరిస్థితి. వారికి పెట్టుబడులు రాకపోవడంతో కౌలు రైతులు ముందుకు రాలేదు. తోటల తొలగింపు తప్ప మామిడి రైతుకు వేరే మార్గం లేదు.

- మడుపల్లి నాగేంద్రరావు, మామిడి రైతు, పోతిరెడ్డిపల్లి

మామిడి కన్నా ఆయిల్‌పామ్ మెరుగు..



దశాబ్దాలుగా మామిడి పైనే ఆధార పడి జీవిస్తున్నాం. ఏటా నష్టాలే. పామాయిల్ సాగు బాగుండడంతో మామిడిని తీసివేసి ఆయిల్‌పామ్ వైపు మొగ్గు చూపు తున్నాం.

- బొప్పూడి రంగారావు, మర్రపూడి

ఆయిల్‌పామ్ సాగుకు రైతులు మొగ్గు



మామిడితో పోలిస్తే ఆయిల్‌పామ్‌కు ఉన్న మెరుగైన పరిస్థితుల దృష్ట్యా రైతులు దానిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. కంపెనీల నుంచి బైబ్యాక్ ఉండడం, ధరల్లో స్థిరీకరణ, కోతుల బెడద లేకపోవడం, చీడపీడల ఉధృతి అంతగా లేకపోవడం వంటి కారణాలు రైతులను ఆయిల్‌పామ్ సాగుకు ఆకర్షిస్తోంది.

- ఆర్.హేమ, ఉద్యాన అధికారిణి

రైతుల్లో గుబులు

» రెండు రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిక
» మొంథా ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న వరి పంట
» మళ్లీ వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతామని అన్నదాతల ఆవేదన

ఏలూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభా వంతో భారీ వర్షాలు కురవడంతో దాని ప్రభావం నుంచి వరి పైరు ఇప్పుడి ప్పుడే తేరుకుంటోంది. మళ్లీ ఇంతలోని వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలు అన్నదాతను వణికిస్తోంది. మొంథా తుఫాన్ తీరం దాటి వారం రోజులు గడు స్తున్నా ఇంకా పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. పంట చేలల్లో నిలబడి నీళ్లను బయటకు పంపించడానికి అన్నదాతలు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోంది. పొలాల గట్లకు గండికొట్టి నీటిని బయటకు పంపుతున్నారు. ఇప్పుడిప్పుడే నీళ్ళు తగ్గి కొంచెం పంటలు తేరుకుంటున్నాయి. ఓవైపు వాతావరణశాఖ అల్పపీడన హెచ్చరికలు రైతులను కలవరపెడుతుంటే బుధవారం సాయంత్రం కురిసిన వర్షం వారిని తీవ్ర ఆందోళనకు గురి చేసింది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురవగా, జిల్లా వ్యాప్తంగా మేఘావృతమైంది. వరి కంకులు నీటిలో రోజులు తరబడి ఉండడంతో తాలు ఎక్కువగా వచ్చి దిగుబడుల్లో భారీ కోత తప్పదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల పంట మొత్తం నేలవాలి నీళ్లలోనే ఉండిపోవడంతో కుళ్లిపోయే స్థితికి చేరుకుందని వాపోతున్నారు. పెట్టుబడి మొత్తం వర్షార్పణమే నని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోసారి పంట పొలాలు ముంపు బారిన బడితే ఇక పూర్తిగా దిగుబడులుపై ఆశలు వదిలేసు కోవడమేనని అన్నదాతలు చెబుతున్నారు.


ఏలూరు రూరల్ మండలంలో వెన్ను దశలో వరి పైరు

● **వట్లూరులో పంట పొలాలు పరిశీలించిన కలెక్టర్**

పెదపాడు : మొంథా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరు పరిధిలోని పంటపొలాలను ఆమె బుధవారం పరిశీ లించారు. పంటలపై తుఫాన్ ప్రభావం గురించి వ్యవ సాయాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఖరీఫ్ 2025 సీజన్‌కు సంబంధించి ఈ-పంట సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. జిల్లా వ్యవసాయశాఖ జేడీఏ షేక్ హబీబ్ బాషా, ఏలూరు సబ్ డివిజన్ ఏడీఏ ఈ.అనిలకుమారి, ఏవో షేమ్ ఇమామ్ కాశీం, డిప్యూటీ తహసీల్దారు రామా రావు తదితరులు పాల్గొన్నారు.



ముదినేపల్లిలో 2,118 ఎకరాల్లో వరి పంట నష్టం

ముదినేపల్లి : మొంథా తుఫాన్ ప్రభావంతో ముదినేపల్లి మండలంలో సార్వా వరి పైరుకు కలిగిన నష్టం అంచనాల సేకరణ పూర్తయింది. మండలంలో 26 రెవెన్యూ గ్రామాల పరిధిలో 2,118 ఎకరాల్లో వరి పంట పూర్తిగా దెబ్బతిన్నట్టు వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది నమోదు చేశారు. మండలంలో సుమారు 1500 మంది రైతులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం అందనుంది. ఎకరానికి రూ.10 వేలు చొప్పున మండలానికి సుమారు 2.03 కోట్లు నష్టపరి హారం అందనుంది. పంట నష్టపోయిన రైతుల జాబితాలను రైతు సేవా కేంద్రాల వద్ద ప్రదర్శించామని ఏవో వేణుమాధవ్ తెలిపారు. మండలంలోని వాడవల్లి రెవెన్యూ గ్రామ ఏరియాలో ఒక్క ఎకరంలో కూడా పంట నష్టం జరగలేదన్నారు.

జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా సుస్మిత రామనాథన్ బాధ్యతలు


ఎస్పీ కేపీఎస్ కిశోర్‌కు పూల మొక్కను అందజేస్తున్న ఏఎస్పీ సుస్మిత

జంగారెడ్డిగూడెం/ఏలూరు క్రైం,నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా ఐపీఎస్ అధికారిణి సుస్మిత రామనాథన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. డీఎస్పీ యు.రవిచంద్ర పుష్పగుచ్ఛం ఇచ్చి ఆమెకు స్వాగతం పలికారు. జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్, ఎస్ఐ లు ఎన్.వీరప్రసాద్, ఎస్‌కె. జబీర్, కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతలను కాపాడతానని, మహిళల పై జరిగే అకృత్యాలను అడ్డుకుంటానని, అక్రమ మద్యాన్ని అరికడతానన్నారు. 2023 బ్యాచ్‌కు చెందిన తాను కాకినాడలో ఏఎస్పీగా ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక గ్రేహౌండ్స్‌లో అసాల్ట్ కమాండర్‌గా పని చేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. తమిళనాడుకు చెందిన సుస్మిత రామనాథన్‌కు మొదటి పోస్టింగ్ ఇదే. జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌కు మొట్టమొదటి సారిగా ఏఎస్పీగా ఐపీఎస్ అధికారిని నియమించడం గమనార్హం. బాధ్యతల స్వీకరణ అనంతరం ఏఎస్పీ సుస్మిత రామనాథన్ ఏలూరు వచ్చి ఎస్పీ కేపీఎస్ కిశోర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందించారు. ఆమెకు ఎస్పీ పలు సూచనలు చేశారు.

కార్తీక విహారం

» ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ ఆలయాలు.. ఆహ్లాదాన్నిచ్చే పలు పిక్నిక్ స్పాట్‌లు



■ లోపలి పేజీలో..

శంభో శంకరా !



ఆచంటలో కార్తీక దీపారాధనలు





ప్రత్యేక అలంకరణలో గునుపూడి సోమేశ్వరస్వామి.. పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి



ద్వారకాతిరుమలలో జ్వాలాతోరణం

కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం ఆలయాలు భక్తులతో కళకళలాడాయి. శివ నామస్మరణతో మారుమోగాయి. కాలువల్లో కార్తీక దీపాలు వదిలారు. శివాలయాల్లో అభిషేకాలు చేశారు. సాయంత్రం జ్వాలాతోరణం వెలిగించారు.

స్ఫటికలింగ దర్శనం

తాడేపల్లిగూడెం రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెం బాలాత్రిపుర సుందరి పీఠంలో స్ఫటికలింగ దర్శనానికి భక్త జనం పోటెత్తారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున నదీజలాలతో అభిషేకాలు నిర్వహించి సర్వజనులకు ప్రత్యేక దర్శనం కల్పించారు. ప్రత్యేక అభిషేకాలతో స్వామి వారికి పూజలు నిర్వహించారు. కరోనా తరువాత కార్తీక పౌర్ణమికి స్ఫటికలింగ దర్శనం అవకాశం ఇవ్వకపోవడంతో భక్తుల కోరిక మేరకు ఐదేళ్ల తర్వాత ఆత్మలింగ దర్శనం ఏర్పాటు చేసినట్టు వ్యవస్థాపకుడు గరిమెళ్ల వెంకట రమణ సిద్ధాంతి తెలిపారు.



మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

ఆచంటలో అఖండజ్యోతి

ఆచంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆచంటేశ్వరుని ఆలయం బుధవారం వేకువజాము నుంచే భక్తులతో పోటెత్తింది. ఇటీవల పెళ్లయిన మహిళలు కొబ్బరిబొండలు, కంద మొక్కలతో ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం అఖండ జ్యోతి (కర్పూర జ్యోతి) ప్రజ్వలన కార్యక్రమం వేలాది మంది భక్తుల శివనామస్మరణల మధ్య వేడుకగా జరిగింది. గొడవర్తి వెంకన్న బాబు దంపతులు కృత్తికా నక్షత్ర హోమం, మండపారాధన, మహానైవేద్యం, దూపసేన నిర్వహించి అనంతరం కర్పూర జ్యోతిని వెలిగించారు. కర్పూర జ్యోతిలో ఆవు నెయ్యి వేయడానికి భక్తులు పోటీ పడ్డారు. సుమారు పదిహేను వేల మంది భక్తులు పైగానే పాల్గొన్నారు. అనంతరం జ్వాలా తోరణం వెలిగించి ప్రభను ఊరేగించారు.



పిప్పరలో జ్యోతిర్లింగార్చన చేస్తున్న భక్తులు





పంచారామాలు కిటకిట

పాలకొల్లు అర్బన్, భీమవరం టౌన్ నవంబరు 5(ఆంధ్రజ్యోతి):కార్తీక మాసం బుధవారం పౌర్ణమి సందర్భంగా పంచారామ క్షేత్రాలు కిటకిటలాడాయి పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. ఆలయం సమీపంలోని రేపాక వారి సత్రంలో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు 12 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. 30 వేల మంది భక్తులు స్వామిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం. గునుపూడిలోని సోమేశ్వర స్వామిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. పౌర్ణమి సందర్భంగా స్వామి వారు శ్వేతవర్ణంతో భక్తులకు దర్శనం ఇవ్వగా తన్మయత్వంతో తిలకించి పులకించిపోయారు. 25 వేల మంది దాకా స్వామివారిని దర్శించుకున్నట్టు ఆలయ అధికారులు తెలిపారు.



మద్ది ఆంజనేయస్వామికి లక్ష గులాబీలతో అర్చన

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):గుర్వాయిగూడెం మద్ది అంజనేయస్వామి ఆలయంలో బుధవారం స్వామి వారికి లక్ష గులాబీలతో అర్చన నిర్వహించారు. స్వామి వారికి అత్యంత ప్రీతికరమైన తమలపాకులతో అష్టోత్తర పూజలు చేశారు. నిత్యాన్నదాన సత్రంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాద వితరణ చేశారు. ఏర్పాట్లను ఈవో చందన పర్యవేక్షించారు

పట్టిసీమ వీరభద్రునికి అభిషేకం

పోలవరం, నవంబరు 5(ఆంధ్ర జ్యోతి) : పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి శివక్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టిసీమలో గ్రామోత్సవం, జ్వాలా తోరణం, గోదావరి హారతి, లక్ష బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ఈవో వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పోలవరం మండలం గుంజవరం ఉమా సహిత భోగలింగేశ్వస్వామి ఆలయం, పోలవరం శ్రీచక్ర సహిత వాసవీ కన్యకా పరమేశ్వరీ సమేత నగరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు చేశారు.



నరసాపురం వలంధర రేవులో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు



సిద్ధాంతంలో గోదావరికి హారతి




ఏలూరు గాంధీనగర్ శివాలయంలో స్వామివారి ఊరేగింపు



పాలకొల్లు క్షీరారాముని ఆలయంలో భక్తుల పూజలు

కార్తీక విహారం

కార్తీకమాసం కావడంతో ఎక్కడికక్కడ వనభోజనాల సందడి మొదలైంది. ఒకపక్క ఆధ్యాత్మిక సందడి.. మరోపక్క విహారయాత్రల హడావుడి.. కార్తీకమాసంలో బంధుమిత్రులు, కుటుంబాలతో కలసి పుణ్య క్షేత్రాల సందర్శన చేస్తుంటారు. పిక్నిక్‌ల పేరుతో విహారాలకు వెళుతుంటారు. ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధ ఆలయాలతో పాటు ఆహ్లాదాన్నిచ్చే పలు పిక్నిక్ స్పాట్‌లు ఉన్నాయి.. సరదాగా విహారానికి వెళ్లేవారికి ఇవి ఆహ్వానం పలుకుతున్నాయి.





చరిత్రకు ఆనవాళ్లు.. ఈ బౌద్ధారామాలు



ధర్మలింగేశ్వరస్వామి ఆలయం

కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీ జీలకర్రగూడెం కొండపై కొలువైన బౌద్ధారామాలు భారతీయ పురాతన సంస్కృతి, వారసత్వ సంపదకు నిలయాలుగా ఉన్నాయి. విదేశీయుల ప్రాచీన గ్రంథాల్లో విశేషంగా చోటు చేసుకున్న బౌద్ధారామాలకు స్వదేశీ చరిత్రలో అంతగా ప్రాచుర్యం సంతరించుకోలేదు. ఒకప్పుడు బర్మా, జపాన్, మలేషియా, థాయిలాండ్ తదితర తూర్పు ఆసియా దేశాల నుంచి భారతదేశానికి వచ్చే ఎక్కువ మంది పర్యాటకులు ఈ బౌద్ధ గుహలను సందర్శించేవారు. విదేశీ పర్యాటకులు నేటికీ పరిశోధనలు చేస్తున్నారు. అమరావతి, ధరణికోట, నాగార్జున కొండలతో పాటు జీలకర్రగూడెం గుహలు కూడా అదేపోలికతో ఉండడంతో ఎంతో ఘనమైన చరిత్ర ఉందని తెలియజేస్తున్నాయి. ఈ కొండపై మూడు రకాల కట్టడాలు ఉన్నాయి. స్థూపాలు, చైత్యాలు, విహారాలు, ఇటుకలు, పాల రాతితో నిర్మించిన స్థూపాలు ఉన్నాయి. ఈ కొండపై తూర్పు భాగాన ఒక పాలరాతి స్థూపం కూడా ఉంది. వివిధ పరిణామాల్లో చిన్నవి, పెద్దవి కలిపి దాదాపు 55 చైత్యాలు ఉన్నాయి. బౌద్ధ బిక్షువులు మరణించిన అనంతరం కట్టిన సమాధులని చరిత్రకారుల అభిప్రాయం. ఆరామాలు అనేవి కొండల్లో ఉన్న రాయిని తొలిచి నిర్మించినవి. వీటిని బిక్షవుల విశ్రాంతికి, విద్యా బోధనకు వాడుకునేందుకు వీలుగా నిర్మించారని చరిత్రకారులు చెబుతున్నారు. కొండపై విశాలమైన వేదశాలలు ఉండేవని ఈ నాటికీ ఉన్న గుర్తులను బట్టి తెలుస్తుంది. శాతవాహన కాలంనాటి నాణేలు ఇక్కడ లభ్యమవ్వడాన్ని బట్టి చూస్తే శాతవాహన కాలంలోనే ఈ ఆరామాలు వర్ధిల్లాయని తెలుస్తుంది. కొండపై తొలచిన ఏకశిల లింగాన్ని ధర్మలింగేశ్వరస్వామిగా భక్తులు కొలిచి కార్తీక సోమవారాల్లో తడిసిన దుస్తులతో మహిళలు ప్రణామాలతో పడుకుని దీక్ష చేస్తే సంతానప్రాప్తి కలుగుతుందనే నమ్మకం నేటికీ ఉంది.

- కామవరపుకోట (ఆంధ్రజ్యోతి)

ఆటపాక పక్షుల కేంద్రం పిలుస్తోంది..



ప్రపంచ ప్రసిద్ధి గాంచిన కొల్లేరు సరస్సుకు విదేశీపక్షులు రాక ప్రారంభంతో కిలకిలరావాల సందడి మొదలైంది. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేలకిలోమీటర్లు ప్రయాణించి సరస్సుకు చేరుతూంటాయి. 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు అనేక జీవజాతులకు ఆలవాలం. ఇక్కడ ఉన్న ఆటపాక పక్షుల కేంద్రానికి కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి వలసవచ్చిన వివిధరకాల పక్షులు కొల్లేరు శీతాకాలపు అతిథులుగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని సంపాదిస్తున్న తీరు అబ్బుర పరుస్తుంది. ఆడ, మగ పక్షులు జతకట్టి సమీప ప్రాంతాల నుంచి పుల్లలు ఏరుకుని గూడులు నిర్మాణం చేసు కుంటాయి. పెయింటెడ్ స్టాక్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల,నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తికి కొల్లేరు అనువైన ప్రదేశం. పర్యాటకంగా కొల్లేరు ఎంతో పేరొందడంతో ఏలూరు, గుడివాడ, భీమవరం తదితర ప్రాంతాల నుంచి కార్తీకమాసంలో పెద్దఎత్తున తరలివచ్చి సందడి చేస్తుంటారు. ఆటపాక పక్షుల కేంద్రంలో వన సమా రాధనలు జరుపుకుంటూ ఉంటారు. కొల్లేరు విశిష్టతను తెలుపుతూ చిత్తడినేలల ఆవశ్యకత, వలస పక్షుల తీరు ఇక్కడ సంతానోత్పత్తి చేసుకునే విధానాన్ని అటవీశాఖ అధికారులు వివరిస్తారు.

-కైకలూరు (ఆంధ్రజ్యోతి)

కొరుటూరు అటవీశాఖ రిసార్టు



బీ.. కేర్‌ఫుల్

కార్తీక మాసం వచ్చిందంటే బీచ్‌లకు వెళుతుంటారు.. సముద్ర స్నానాలతో సందడి చేస్తూంటారు. అటవీ ప్రాంతాలను సందర్శించి క్రొత్త అనుభూతిని పొందుతుంటారు. అయితే యువత హద్దులు మీరి ప్రవర్తించడం ద్వారా ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దేవాలయాల సందర్శన సమయంలో కుటుంబ పెద్దలు అప్రమత్తంగా ఉండాలి. జన సందోహంలో పిల్లలు తప్పిపోతారు. పిల్లలను ఓకంట కనిపెడుతూ ఉండాలి. పిల్లలకు ఫోన్‌నెంబర్, అడ్రస్ చెప్పేలా తర్ఫీదు నివ్వాలి. యువతీ యువకులు గోదావరి తీర ప్రాంతాలైన పోలవరం, పట్టిసం, సిద్ధాంతం, అంతర్వేది వరకు గల నదీ తీరాలకు వెళుతూంటారు. నదీస్వభావం తెలియక గోదావరి నదీ ప్రాంతాల్లో లోతుకంటూ వెళ్లి ప్రమాదాల బారిన పడుతున్నారు. కార్తీకమాసంలో పేరుపాలెం బీచ్‌కు పెద్ద సంఖ్యలో వెళుతుంటారు. పేరుపాలెం బీచ్ మలుపులో ఉండడం వల్ల ఇచ్చట మట్టి ఎల్లప్పుడూ కోతకు గురవడం వల్ల సుడిగుండాలు ఏర్పడి తీరం కోతను చేస్తూ లోతైన గోతులను ఏర్పరుస్తాయి.ఇది తెలియనని చాలామంది ఉత్సాహంగా లోతుకు వెళుతూ ప్రమాదాల భారిన పడిన సంఘటనలు గతంలో జరిగాయి. కామవరపుకోట సమీపాన గల గుంటుపల్లి గుహలను, జంగారెడ్డిగూడెం సమీపాన గల గుబ్బల మంగమ్మ, పోలవరం అటవీ ప్రాంతాలను సందర్శిస్తుంటారు. కొత్త జంటలు, ప్రేమికులు సంద ర్శన ప్రాంతాన్ని వదిలి ఏకాంతం కోసం అడవి లోపలికి వెళ్తూంటారు. ఇలా ఒంటరిగా వెళ్లే జంటలను టార్గెట్ చేస్తూ కొంతమంది అఘాయిత్యాలకు పాల్పడుతుంటారు. సో..బీకేర్ ఫుల్..

- నిడమర్రు (ఆంధ్రజ్యోతి)

పాపికొండలు చూసొద్దాం..

పోలవరం గ్రామానికి 40 కిలోమీటర్ల దూరంలో పాపికొండలకు అతి చేరువలో ఉన్న అటవీశాఖ ఉడెన్ రిసార్టు వన విహారాలకు పెట్టింది పేరు. అతి చేరువలో ఎత్తైన పాపికొండలు... పాపికొండల నడుమ వయ్యారంగా మెలికలు తిరుగుతూ ప్రవహించే గోదావరి.. చుట్టూ పచ్చని కార్పెట్ పరిచినట్టు ప్రకృతి... పక్షుల కిలకిలా రావాలతో పాపికొండల అభయారణ్యం పర్యాటకులకు ఆహ్వానం పలుకుతోంది. ఇక్కడికి చేరుకోవాలంటే రాజమహేంద్రవరం నుంచి పోశమ్మగండికి చేరుకుని అక్కటి నుంచి టూరిజం బోట్లలో వెళ్ళాల్సి ఉంటుంది. గోదావరిపై బోటు ప్రయాణం అభయారణ్యంలో వన భోజనాలు చాలా ఆనందాన్నిస్తాయి. రిసార్టులో ఒక కుటుంబం ఒక రాత్రి ఒక పగలు బస చేయాలంటే ఐదువేల రూపాయల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. ఇక గండి పోశమ్మ బోట్ పాయింట్ నుంచి కొరుటూరు రిసార్టుకి చేరుకోవాలంటే పెద్దలకు రూ.900, 5 నుంచి 10 ఏళ్ల వయసు పిల్లలకు రూ.800 చెల్లించాల్సి ఉంటుంది.బోటు ప్రయాణంలో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం కూడా ఇస్తారు. పోలవరం గ్రామానికి 45 కిలోమీటర్ల దూరంలో ఉన్న పేరంటాలపల్లి శివక్షేత్రం చుట్టూ అడవులు, చల్లటి సెలయేరు, భారీ వృక్షాలలో వనభోజనాలకు ఈ ప్రదేశం అనుకూలంగా ఉంటుంది. ఈ శివక్షేత్రానికి వెళ్ళాలంటే రాజమహేంద్రవరం నుంచి పోశమ్మ గండికి చేరుకుని అక్కడి నుంచి టూరిజం బోట్లలో ప్రయాణించాల్సి ఉంటుంది. కొయిదా కూనవరం నుంచి కూడా టూరిజం బోట్లలో వెళ్లవచ్చు.

ఆలయాల సందర్శన

గోదావరి నది మధ్యన కొండపై స్వయంభువుగా వెలసిన పట్టిసీమ శివక్షేత్రం రాజమహేంద్రవరం, నిడదవోలు, జంగారెడ్డిగూడెం పట్టణాలకు 40 నుంచి 50 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ శివక్షేత్రం చుట్టూ ఉన్న సహజ వనాలు సుమారు 150 ఎకరాలలో విస్తరించి ఉన్నాయి. ప్రతి ఏటా భక్తులు ప్రజానీకం పట్టిసీమ ఫెర్రీ రేవు నుంచి లాంచీపై ప్రయాణించి అక్కడి సహజ వనాల్లో వన భోజనాలు చేసి అక్కడి శివక్షేత్రాన్ని దర్శించి వన విహారాల్లో ఉల్లాసంగా గడుపుతారు. పోలవరం ప్రాజెక్టు దిగువ కాపర్ డ్యాంకి సమీపంలో గోదావరి మధ్యలో కొండపై స్వయంభువుగా వెలసిన మరో శివక్షేత్రం మహానందీశ్వరస్వామి ఆలయం. ఈ ఆలయం చుట్టూ ఉన్న సహజవనాలు, అటు ప్రాజెక్టుని ఇటు ప్రకృతిని మరో వైపు గోదావరి అందాలను చూడడానికి ఎంతో బావుంటుంది.

- పోలవరం (ఆంధ్రజ్యోతి)



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన పల్లెర్లమూడి జడ్పీ హైస్కూలు విద్యార్థులు

రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలకు ఎంపిక

ఏలూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏలూరులోని సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూల్లో జిల్లా స్థాయి సైన్స్ డ్రామా పోటీలు బుధవారం జరిగాయి. జిల్లాలోని 6 మండలాల నుంచి 11 పాఠశాలలకు చెందిన విద్యార్థి బృందాలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. మానవజాతికి శాస్త్ర, సాంకేతికత ప్రయోజనాలు ప్రధానాంశంగా మొత్తం 5 ఉప అంశాల్లో శాస్త్రీయ సందేశాన్నిచ్చే డ్రామా పోటీలు జరిగాయి. నూజివీడు డివిజన్‌లోని పల్లెర్లమూడి జడ్పీ హైస్కూలు విద్యార్థుల బృందం ప్రథమ స్థానం సాధించి రాష్ట్ర స్థాయికి జిల్లా నుంచి అర్హత సాధించింది. ఈ నెల 7న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి సైన్స్ డ్రామా పోటీలు జరుగుతాయని జిల్లా సైన్స్ ఆఫీసర్ సోమయాజులు తెలిపారు. ఈ పోటీలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థి బృందాలు ఈ నెల 20,21 తేదీల్లో బెంగళూరులో నిర్వహించే దక్షిణ భారత స్థాయి పోటీకి ఏపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు. జిల్లా స్థాయి పోటీలో ప్రథమ స్థానంలో నిలిచిన పల్లెర్లమూడి జడ్పీ హైస్కూలు విద్యార్థులకు, ద్వితీయ స్థానంలో నిలిచిన సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. స్కూలు హెచ్‌ఎం కుటుంబరావు, గైడ్‌టీచర్లు పద్మాకుమారి, తదితరులు పాల్గొన్నారు.

12న విద్యాజ్యోతి పురస్కారాలు అందజేత

ఏలూరు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యాదాత, సర్వోదయ నాయకులు మూర్తిరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 12న మూర్తిరాజు నెలకొల్పిన 70విద్యాసంస్థల్లో విద్యాజ్యోతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు సర్వోదయ మండలి ఉమ్మడి జిల్లా కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. విద్య, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాజ్యోతి అవార్డులు అందజేస్తామన్నారు.



పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

పెదవేగి గురుకుల విద్యాలయంలో అథ్లెటిక్స్ పోటీలు

పెదవేగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెదవేగిలోని డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో బుధవారం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా 14, 17 ఏళ్ల విభాగం అథ్లెటిక్స్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. ఉమ్మడి జిల్లాలోని 5డివిజన్లనుంచి 700మందికి పైగా విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. బాల, బాలికల విభాగంలో షాట్‌పుట్, జావెలిన్ త్రో, డిస్కస్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, పరుగు పందేల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కె.జయరాజు తెలిపారు. గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ రమేష్‌బాబు, ఎస్జీఎఫ్ 14, 17ఏళ్ల విభాగం జిల్లా కార్యదర్శి కె.అలివేలుమంగ, పీడీలు రాజేంద్రప్రసాద్, దుర్గాప్రసాద్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

11, 12న క్రీడలకు సివిల్ సర్వీస్ ఉద్యోగుల ఎంపిక

ఏలూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 11, 12 తేదీల్లో ఏలూరు జిల్లాలోని ప్రభుత్వ సివిల్ సర్వీస్ ఉద్యోగులకు, పురుషులు, మహిళలకు పలు క్రీడాంశాల్లో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ తెలిపారు. ఏలూరు అల్లూరి సీతారామరాజు స్టేడియంలో 11న అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్ ఫుట్‌బాల్, కోకో, బెస్ట్ ఫిజిక్, హాకీ, కబడ్డీ, టేబుల్ టెన్నిస్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, రైజింగ్, స్విమ్మింగ్, 12న యోగ, డ్యాన్స్ షార్ట్ విభాగంలో ఎంపిక పోటీలు ఉంటాయన్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన వారిని నవంబరు 10 నుంచి 22వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైతే జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడా పోటీలకు ఏపీ తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తి గల ఉద్యోగులు ఎంపికల తేదీల ప్రకారం ఉదయం 9గంటలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కార్యాలయానికి హాజరు కావాలన్నారు. వివరాలకు 9948779015 నంబరులో సంప్రదించాలని సూచించారు.

నార్వే పార్లమెంట్‌ను సందర్శించిన ఎంపీ మహేశ్

ఏలూరుటూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):నార్వే పర్యటనలో ఉన్న ఎంపీల బృందం ఆ దేశ పార్లమెంట్‌ను సందర్శించారు. పార్లమెంట్‌లో వివిధ సభా సంఘాలతో సమావేశమయ్యారు. ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ విదేశీ వ్యవహారాలు, సాంస్కృతిక, రక్షణ, పరిశ్రమలకు చెందిన స్టాండింగ్ కమిటీ సభ్యులతో మాట్లాడారు. అనంతరం నార్వేయన్ ఏజెన్సీ ఫర్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన డిజిటల్ పబ్లిక్ గూడ్స్ అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. భారతదేశం డిజిటలైజేషన్‌లో అమలు చేస్తున్న సేవలను వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

అవకాశాలను సద్వినియోగం చేసుకోండి

జాబ్ మేళాలో యువతకు ఎమ్మెల్యే చంటి దిశానిర్దేశం

ఏలూరుటూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉపాధి అవకాశాలు మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. అశోక్‌నగర్ కేపీడీటీ హైస్కూల్లో మెగాజాబ్ మేళా నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ జాబ్‌మేళా ద్వారా యువత బంగారు భవిష్యత్తును బంగారుమయం చేసుకోవాలన్నారు. పెద్దఎత్తున ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రైవేటు కంపెనీలను భాగస్వాములను చేస్తూ యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ దాదాపు 19కంపెనీలు జాబ్‌మేళలో పాల్గొన్నాయన్నారు. ఈ మేళాలో 232మందిని ఎంపిక చేసి ఉద్యోగాలు కల్పించామన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి నవీన్, ఇడా ఛైర్మన్ శివప్రసాద్, ఏఎంసీ ఛైర్మన్ పార్థసారథి, పూజారి నిరంజన్, చోడే వెంకటరత్నం పాల్గొన్నారు.

పాలకొల్లులో ఫిలిం ఇనిస్టిట్యూట్ ప్రారంభం



ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పాలకొల్లు అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కళలకు, కళాకారులకు పుట్టినిల్లు అయిన పాలకొల్లులో అల్లూరి సీతారామరాజు జాతీయ ఫిలిం ఇనిస్టిట్యూట్ ఏర్పాటు అభినందనీయమని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. పాలకొల్లులో జాతీయ ఫిలిం ఇనిస్టిట్యూట్ ప్రారంభ కార్యక్రమంలో మంత్రి బుధవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మాజీ మంత్రి చేగొండి వెంకట హరిరామ జోగయ్య, గౌరవాధ్యక్షుడు గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, కార్యదర్శి కేఎస్‌పీఎస్.వర్మ తదితరుల నేతృత్వంలో ఇనిస్టిట్యూట్ ఏర్పాటైంది. మంత్రి నిమ్మల మాట్లాడుతూ తెలుగు చలన చిత్రరంగంలో పాలకొల్లుకు ప్రత్యేక స్థానం ఉందని, పాలకొల్లు కీర్తిని అల్లు రామలింగయ్య, కోరాడ చలం, దాసరి నారాయణ రావు, కోడి రామకృష్ణ, రేలంగి నరసింహారావు, ఎస్ఎస్.రవిచంద్ర, రవిరాజా పినిశెట్టి, చేగొండి అనంత శ్రీరామ్, తదితరులు ఎందరో సినీ పరిశ్రమలో రాణించి పాలకొల్లుకు మంచి పేరు తీసుకువచ్చారన్నారు. ఇంతటి ప్రతిష్ఠకలిగిన పాలకొల్లులో ఫిలిం ఇనిస్టిట్యూట్ జాతీయ స్థాయిలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జోగయ్య మాట్లాడుతూ పాలకొల్లులో ఫిలిం ఇనిస్టిట్యూట్ ఏర్పాటు చేయడం తన చిరకాల వాంఛ అన్నారు. సంస్థ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ మాట్లాడుతూ ఇనిస్టిట్యూట్ కార్యకలాపాలను వివరించారు. రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ మోహన్, సినీ దర్శకుడు రాజా వన్నెంరెడ్డి, బోనం నరసయ్య, విటాకుల వెంకట రమణ, కెగణపతి రాజు, వీరా పోతన, సుధీర్, గుడాల హరిబాబు, ముత్యాల రామారావు, ముత్యాల శ్రీవాత్సవ, మారంపూడి ఉదయ్‌కుమార్, బందెల భాస్కరరావు, కబాడి కబాడీ నటరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బయటి వ్యక్తులకు రేషన్ ఇస్తే చర్యలు

నరసాపురం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వాస్తవ లబ్ధిదారులకు కాకుండా ఇతర ప్రాంతాల వారికి ప్రభుత్వం అందించే నిత్యావసరాలు పంపిణీ చేస్తే డీలర్లపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఐవీవీ.సత్యనారాయణ హెచ్చరించారు. పట్టణంలోని శ్రీహరిపేట రేషన్ షాపును బుధవారం ఆయన తనిఖీ చేశారు. కార్డుల వివరాలను పరిశీలించారు. నరసాపురం ప్రాంతంలో నివాసం కాకుండా ఇతర జిల్లాకు చెందిన చాలామంది ఇక్కడ రేషన్ తీసుకుంటున్న సమాచారంతో తనిఖీలు చేపట్టామన్నారు. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సాయం అందించాలని డీలర్లను ఆదేశించారు.

గొడవను అడ్డుకుంటే.. సీసాతో పోట్లు

ఆకివీడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గొడవను ఆపడానికి వెళ్లిన వ్యక్తి పై సీసా పగలుకొట్టి దాడి చేయడంతో అతను ఫిర్యాదు మేర ఏఎస్ఐ బండి సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక సమతానగర్‌కు చెందిన గండేటి మణికంఠ సిద్ధాపురంరోడ్‌లో మద్యం దుకాణం దగ్గర మద్యం సేవిస్తున్నాడు. అక్కడ పెద్దులు అనే వ్యక్తి ముగ్గురితో గొడవ పడుతుండగా మణికంఠ గొడవను ఆపడానికి ప్రయత్నించాడు. పెద్దులు పగిలిన కూల్‌డ్రింక్ సీసాతో మణి కంఠ ఎడమ ఛాతిపై పొడవడంతో రక్తపు గాయాలయ్యాయి. ప్రభుత్వాసుపత్రిలో చి కిత్స పొందుతూ ఫిర్యాదు మేర ఏఎస్ఐ కేసు నమోదు చేశారు.

దాడి కేసు నమోదు

ఉండి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొట్టి గాయపరిచిన వ్యక్తిపై కేసు నమోదుచేసినట్లు ఉండి పోలీసులు తెలిపారు. పోలీసులు బుధవారం రాత్రి కేసు వివరాలు తెలిపారు. ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన భగాతి రమేష్‌ను అదే గ్రామానికి చెందిన అతని స్నేహితుడైన పైడి చందు గత నెల 15న రాత్రి 9గంటల సమయంలో కొట్టి గాయపరిచాడు. బాధితుడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.



కలప ట్రాక్టర్‌ను అడ్డుకున్న కూటమి నాయకులు, మోగల్లు దేవస్థానం భూమిలో నిద్రగన్నేరు, వేప కలప

కలప అక్రమ రవాణా అడ్డుకున్న కూటమి నాయకులు

నరసాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారాంపురంలో బుధవారం కలప అక్రమ తరలింపును కూటమి నాయకులు అడ్డుకున్నారు. ఎటువంటి అనుమతులు, వేలం పాట నిర్వహించకుండా తీసుకెళ్లడంపై అభ్యంతరం తెలిపారు. ఇటీవల మొంథా తుఫాన్ కారణంగా కాల్వ పక్కన ఉన్న చెట్లు నేలకొరిగాయి. కొంతమంది ట్రాక్టర్‌పై కలపను తరలించడాన్ని అడ్డు తెలిపారు. చెట్లను అధికారులు ఏకపక్షంగా ఎవరికి కట్టబెడుతున్నారో చెప్పాలని కూటమి నాయకులు పట్టుబట్టారు. దీనిపై ఇరిగేషన్ డీఈ వెంకటనారయణ వివరణ కోరగా చెట్లకు కార్యాలయంలో ఇటీవల వేలం నిర్వహించామన్నారు. ప్రారంభ ధర రూ.30వేలు పెట్టగా సీతారాంపురానికి చెందిన ఇంటి మురళి రూ. 45 వేలకు పాటను దక్కించుకున్నారని డీఈ తెలిపారు.

మోగల్లులో అడ్డుకున్న గ్రామస్థులు

పాలకోడేరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మోగల్లు పెన్నేరమ్మ మారెమ్మ పూరిగుడి వద్ద ఉన్న సుమారు 25ఏళ్ల నాటి వేప, నిద్రగన్నేరు మొక్కలను తరలిస్తుండగా సర్పంచ్ భర్త మల్లిపూడి శ్రీనివాస్, గ్రామస్తులు మంగళవారం అడ్డుకున్నారు. గ్రామంలోని పూరిగుడి వద్ద దేవస్థానానికి చెందిన మొక్కలను తాడేపల్లిగూడెంకు చెందిన వ్యాపారులకు అప్పగించే ప్రయత్నం చేశారు. గుడి వద్ద భారీ వృక్షాలను ఎటువంటి అనుమతులు లేకుండానే నరికివేయడమే కాకుండా వేరేవారికి ధారాదత్తం చేయడం సమంజసం కాదని, విచారణ చేపట్టి న్యాయం చేయాలని సర్పంచ్ భర్త మల్లిపూడి శ్రీనివాస్, గ్రామస్తులు అంటున్నారు.

జైన్ దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే అంజిబాబు

భీమవరం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా జైన్‌లు పండుగ పూర్ణిమ మేళా మహోత్సవంలో రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) పాల్గొన్నారు. పెద అమిరంలోని జైన్ దేవాలయంలో బుధవారం జరిగిన కార్తీక పూర్ణిమ మేళా మహోత్సవంలో స్వామివారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. సంవత్సరంలో ఒక్కరోజు మాత్రమే కార్తీక పూర్ణిమ మేళా మహోత్సవాన్ని ఇంత వైభవంగా సంప్రదాయ బద్ధంగా నిర్వహించడం అభినందనీయమని ఆయన అన్నారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు, హారతులు అందించారు. దేవాలయ ప్రాంగణంలో కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో మెహందర్ కుమార్ జైన్, ప్రకాష్ కుమార్ జైన్, నరేష్ కుమార్ జైన్, రమేష్ కుమార్ జైన్, ప్రమోద్ కుమార్ జైన్, వినోద్ కుమార్ జైన్, వబిలిశెట్టి రామకృష్ణ, యర్రంశెట్టి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



టోర్నమెంట్ బ్రోచర్ విడుదల చేస్తున్న నిర్వాహకులు

8 నుంచి పాలకొల్లులో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు

పాలకొల్లు టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పాలకొల్లులో ఈనెల 8 నుంచి 14 వరకూ జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలు నిర్వహిస్తున్నట్టు కాస్మోకల్చరల్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రెసిడెంట్ గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు తెలిపారు. స్థానిక కాస్మోస్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం విలేకర్ల సమావేశంలో టెన్నిస్ పోటీల బ్రోచర్లను విడుదల చేశారు. గాంధీ భగవాన్‌రాజు మాట్లాడుతూ పోటీలు సంస్థ వ్యవస్థాపకుడు చెరుకూరి బుద్ధావతారం రాజు మెమోరియల్ పేరుతో నిర్వహిస్తున్నామని తెలిపారు. పోటీలు 45, 55, 65, 70, 75, ఏజ్ గ్రూపుల నిర్వహిస్తామని తెలిపారు. 45, 70, 75 ఏజ్ గ్రూపులవారిక జీఎస్‌వీఆర్ఎస్ఎన్ రాజు(పాలకొల్లు), 55, 65 ఏజ్ గ్రూపుల వారికి ఎన్ శ్రీనివాసరాజు (నరసాపురం) కన్వీనర్లగా వ్యవహరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు ఆర్ సత్యనారాయణ రాజు, ఆర్.రమేష్‌బాబు, ఆర్గనైజర్ జీఎస్‌వీఆర్ సూర్యనారాయణ రాజు, కె.శ్రీనివాసరాజు, జి.ఈశ్వరరాజు, సీహెచ్.సూర్యనారాయణరాజు, కె.గణపతి రాజు, సీహెచ్ఎన్ఎంకె.రాజు, ఎస్.రాజు, ప్రదీప్‌వర్మ, పి.వరప్రసాద రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఆరిమిల్లికి స్వాగతం పలుకుతున్న ఎన్ఆర్ఐలు

న్యూజిలాండ్ పర్యటనలో ఆరిమిల్లి

తణుకు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లారు. న్యూజిలాండ్ ఎయిర్ పోర్టులో బుధవారం ఉదయం ఆరిమిల్లిని అక్కడి ప్రవాసాంధ్రులు ఘనంగా స్వాగతం పలికారు. నియోజకవర్గం, రాష్ట్రంలో అభివృద్ధి గురించి వివరించినట్లు క్యాంపు కార్యాలయం ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా ఈనెల 8, 9 తేదీలలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. 8న ఆంధ్ర తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొంటారని వివరించారు. 9న టీడీపీ న్యూజిలాండ్ విభాగం ఆధ్వర్యంలో జరిగే సమావేశంలో పాల్గొంటారని చెప్పారు. స్వాగతం పలికిన వారిలో ప్రవాసాంధ్రులు మద్దుకూరి దిలీప్, గోరంటాల ఆశోక్, నిమ్మగడ్డ జితేంద్ర, గారపాటి మమత తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దేవరపల్లిలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో తాడువాయి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో జె.కీర్తన, కె.కార్తీక్‌లు, అండర్ 17 విభాగంలో వి.లక్ష్మీప్రియ, ఈశ్వర్‌లు ఎంపికయ్యారు. ఈ నెల 19వ తేదీ నుంచి మూడ్రోజుల పాటు అన్నమయ్య జిల్లా మదనపల్లిలో జరిగే రాష్ట్ర స్థాయి ఫుట్ బాల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్‌ఎం ఎస్.వి.ఎల్.నరసమాంబ తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయుడు ఎన్.నాగేంద్రబాబును హెచ్‌ఎం నర్సమాంబ, పాఠశాల కమిటీ ఛైర్మన్ జల్లి వీర్రాజు అభినందించారు.

రాష్ట్ర స్థాయికి బుట్టాయగూడెం విద్యార్థులు..

బుట్టాయగూడెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు బుట్టాయగూడెం పీఎం శ్రీ హైస్కూల్ ప్లస్‌కు చెందిన కె.చైతన్య అండర్ 14 విభాగంలోను, పి.రమ్య అండర్ 17 విభాగంలో ఎంపికైనట్లు హెచ్‌ఎం కె.సుబ్బలక్ష్మి తెలిపారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ పెదవేగి పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో విశేష ప్రతిభ కనబరిచి కడప, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులకు శిక్షణనిచ్చిన వ్యాయమ ఉపాధ్యాయులు ఆర్.సీతారామ్, తెల్లం శ్రీనివాసరావు, కె.రామచంద్రంలను హెచ్‌ఎం, ఎస్ఎంసీ ఛైర్మన్, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

దీపావళి బోనస్ ఇవ్వాలంటూ కార్మికుల ఆందోళన

పెదవేగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దీపావళి బోనస్ తక్షణం చెల్లించాలని కోరుతూ పెదవేగిలోని ఏపీ ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీ కార్మికులు ఫ్యాక్టరీ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఇఫ్టూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం అలసత్వం వహిస్తోందన్నారు. ఈ మేరకు జనరల్ మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీనియర్ మేనేజర్ యు.సుధాకర్‌లతో ఫోన్లో మాట్లాడగా వచ్చే సోమవారం నాటికి బోనస్ ఇవ్వడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో కార్మికులు ధర్నా విరమించారు. ఇఫ్టూ అనుబంధ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు మానికొండ ప్రసాద్, హరిబాబు, నాగరాజు, చింతల అప్పారావు, ప్రసాద్, శివ, రాజేష్, నరేంద్ర పాల్గొన్నారు.

ధర్మాజీగూడెంలో వాహనాల తనిఖీ

లింగపాలెం, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మాజీగూడెంలో స్థానిక ఎస్ఐ కె.వెంకన్న వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకన్న మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామన్నారు.ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలవరాన్ని ఆదివాసీ జిల్లాగా చేయాలంటూ ధర్నా



కుక్కునూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక ఆదివాసీ జిల్లాగా ఏర్పాటు చేయాలని బుధవారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కూరం సంజీవరావు మాట్లాడుతూ ఏజెన్సీ మండలాలను కలుపుతూ ప్రత్యేక ఆదివాసీ జిల్లా చేసి సింగరాజు దొర జిల్లాగా నామ కరణం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.వేణుగోపాల్, మడకం చంద్రరావు, సరియం ప్రసాద్, మడకం వెంకటేశ్వరరావు, కంటిపల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం

కుక్కునూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దామరచర్ల గ్రామంలో బుధవారం జరిగిన అగ్నిప్రమాదంలో అలివేలు అనే మహిళ ఇల్లు కాలిబూడిదైంది. కార్తీక పౌర్ణమి సందర్భంగా కుటుంబ సభ్యులంతా పుట్టలో పాలు పోసేందుకు బయటకు వెళ్లగా షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగగా గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు పూర్తిగా దగ్ధమైంది.

చైన్ స్నాచింగ్ ముఠా అరెస్టు



మీడియా సమావేశంలో కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మోటార్ సైకిళ్లను తస్కరించి వాటిని ఉపయోగించి చైన్ స్నాచింగ్స్‌కు పాల్పడుతున్న ఐదుగురు ముఠా సభ్యులను ప్రత్యేక బృందం అరెస్టు చేసినట్టు ఎస్పీ కేపీఎస్ కిశోర్ తెలిపారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ కిశోర్ కేసు వివరాలను వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం కోళ్లపర్రు గ్రామానికి చెందిన తాటిపర్తి రాముడు(35), నక్కా వెంకటేశ్(22), తాటిపర్తి దుర్గారావు(26), ఉండి మండలం అత్తమూరు గ్రామానికి చెందిన గండికోట నాగరాజు(25), అత్తిలి మండలం యర్రనేలగుంట గ్రామానికి ఆశెట్టి నాగేష్(28) ఒక ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని అన్నారు. తాడిపర్తి రాముడుపై 11 కేసులు, తాడిపర్తి దుర్గారావుపై 19, గండికోట నాగరాజుపై 3, ఆశెట్టి నాగేశ్‌పై 14 కేసులు ఉన్నాయన్నారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి మోటారు సైకిళ్లను దొంగిలించి వాటిని ఉపయోగించి చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్నారని వివరించారు. బుధవారం మధ్యాహ్నం ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామ శివారు మురికికోడు వంతెన వద్ద నాలుగు మోటారు సైకిళ్లు వేసుకుని వస్తున్న వీరిని అదుపులోకి తీసుకుని 65 గ్రాముల బంగారపు వస్తువులను స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. వీరిని విచారించగా ఆకివీడు ఎస్‌బీఐ బ్యాంకులతో 38.8 గ్రాముల బంగారం తాకట్టు పెట్టారని దానిని రికవరీ చేయాల్సి ఉందన్నారు. వీరందరిపై రౌడీ షీట్లు ఓపెన్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, రికవరీ చేసిన సొత్తు రూ.10 లక్షల 20 వేల ఉంటుందని, మరో రూ.3 లక్షల 80 వేల సొత్తును రికవరీ చేయాల్సి ఉందన్నారు.

సుగర్స్ ఫ్యాక్టరీలో ఇత్తడి సామగ్రి చోరీ ముఠా అరెస్ట్

తణుకు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తణుకు ఆంధ్రా సుగర్స్‌లో సెప్టెంబరులో అత్యంత విలువైన ఇత్తడి, ఇతర లోహపు సామగ్రి చోరీ కేసులో ఏడుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ కె.చంద్రశేఖర్ తెలిపారు. తణుకు వెంకట్రాయపురంలోని దిఆంధ్రా సుగర్స్ ఫ్యాక్టరీలో సెప్టెంబరు 29న విలువైన ఇత్తడి, ఇతర విలువైన లోహపు సామగ్రి చోరీకి గురైనట్టు కర్మాగారం అదనపు సెక్రటరీ పాతూరి వెంకట సత్యవిశ్వనాథకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. ఈకేసు దర్యాప్తులో భాగంగా కర్మాగారంలో పని చేస్తున్న అత్తిలి మండలం గుమ్మంపాడుకు చెందిన చొప్పెర్ల పండు, మీసాల రామాంజనేయులు, తణుకు మండలం వేల్పూరుకు చెందిన సప్పిడి సత్యనారాయణ, ఇరగవరం మండలం గోటేరుకు చెందిన ర్యాలీ సురేష్, తణుకు వెంకట్రాయపురానికి చెందిన కట్టా సత్యనారాయణ, ఉండ్రాజవరం మండలం పసలపూడి గ్రామానికి చెందిన వెలిగట్ల శ్రీను, నిడదవోలుకు చెందిన కొఠారి శ్రీనివాసులపై కేసు నమోదు చేసి బుధవారం అరెస్ట్ చేశామన్నారు. వీరు దొంగిలించిన ఇత్తడి, ఇతర లోహపు వస్తువులు సుమారు 281 కిలోలు ఉంటాయని, వీటి విలువ సుమారు రూ.1.12లక్షలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్టు తెలిపారు. కేసు విచారణలో కానిస్టేబుల్స్ అన్వర్, మలకా శ్రీను, రవీంద్ర, మహేష్, భాస్కర్‌లు సహకరించినట్లు తెలిపారు.

మెడికల్ బిల్లులు వెంటనే చెల్లించండి

పలు సంఘాల నాయకుల విజ్ఞప్తి



సూపరింటెండెంట్ రాజుతో సమావేశమైన ఉద్యోగ సంఘ నాయకులు

ఏలూరు క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పోలీసులకు సంబంధించిన మెడికల్ రియంబర్స్‌మెంట్ క్లైములు రూ.50 వేల లోపు బిల్లులు చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని వివిధ సంఘాల నాయకులు ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంఎస్ రాజును కోరారు. జేఏసీ ఛైర్మన్, ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ అధ్యక్షులు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెర్సు రామారావు, పోలీసు అధికారుల సంఘ అధ్యక్షులు ఆర్.నాగేశ్వరరావు, ఏలూరు తాలూకా అధ్యక్షులు శ్రీధర్‌రాజులు కలిసి ఏలూరు ప్రభుత్వాసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌తో సమావేశమై తమ సమస్యలను వివరించారు. 8 నెలలుగా ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పోలీసులు, పెన్షన్లకు సంబంధించిన మెడికల్ బిల్లులు సుమారు 800పైగా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని తక్షణం పరిష్కరించాలని కోరారు. అయితే ఈ నెలాఖరులోపు వాటన్నింటిని పరిష్కరిస్తామంటూ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ రాజు హామీ ఇచ్చారు. ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ కుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ చోడగిరి వంశీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శైలేంద్ర,ఫార్మాసిస్టు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మహిధార చార్యులు, నర్సింగ్ అసోసియేషన్ నాయకులు దయావతమ్మ పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ సీజ్

దెందులూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): 16వ నెంబర్ జాతీయ రహదారిపై దెందులూరు మీదుగా వెళ్తున్న కోళ్ల వ్యర్థాల ఐషర్ వ్యాన్‌ను దెందులూరు పోలీసులు బుధవారం సీజ్ చేశారు. హైదరాబాద్ నుంచి దెందులూరు మీదుగా నిడమర్రు చేపల చెరువులో మేతగా వేసేందుకు కోళ్ల వ్యర్థాలు తరలిస్తుండగా సత్యనారాయణపురం సమీపంలో దెందులూరు ఎస్ఐ ఆర్.శివాజీ పట్టుకుని వాహనాన్ని సీజ్ చేశారు. డ్రైవర్‌తో పాటు పెదపాడుకు చెందిన వాహనదారుడు విజయ్, నిడమర్రు పరిధిలోని చెరువు యజమానిపై కేసులు నమోదు చేశామన్నారు.



బియ్యం దిగుమతి చేస్తున్న దృశ్యం

డీలర్లకు సరుకుల సరఫరా

జంగారెడ్డిగూడెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నేటికీ అందని రేషన్... సీఎస్‌డీటీకి డీలర్ల మొర శీర్షికన బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు.అధికారులు కాంట్రాక్టరుతో మాట్లాడి రెండు మినీ వ్యాన్‌లు ఏర్పాటు చేయించి రేషన్ దుకాణాలకు బియ్యం, పంచదార సరఫరా చేశారు. దీంతో రేషన్ డీలర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా సమస్య లేకుండా, పెద్ద లారీ వెళ్లలేని రేషన్ దుకాణాలకు మినీ వ్యాన్‌లపై సరుకులు సరఫరా చేయాలని డీలర్లు కోరుతున్నారు.

గోదావరిలో పడి ఒకరి మృతి

ఆచంట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం కరుగోరుమిల్లి శివారు నెల్లివారిపేటకు చెందిన ఇంజేటి పెద్దిరాజు(58) ప్రమాదవశాత్తు బుధవారం గోదావరిలో పడి మృతి చెందాడు. తన పశువులను గ్రామంలో ఉన్న గోదావరి రేవులోకి కడగడానికి వెళ్లాడు. అదే సమయంలో దూడ గోదావరిలో ప్రవాహానికి వెళ్లిపోవడంతో కాపాడేందుకు ప్రయత్నం చేసి పెద్దిరాజు మునిగిపోయాడు. గ్రామస్థులు పడవలతో గాలించగా భీమలాపురం సమీపంలో పెద్దిరాజు మృతదేహం లభ్యమైంది. పెద్దిరాజు భార్య కూడా ఇటీవల మృతి చెందింది. పెద్దిరాజుకు ముగ్గురు కుమారులున్నారు. ఎస్ఐ కె.వెంకట రమణ కేసు నమోదు చేశారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఏలూరు క్రైం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏలూరు వన్‌టౌన్ పరిధిలోని బెనర్జీపేట పంట కాల్వలో గుర్తుతెలియని మృత దేహం ఉన్నట్టు తెలియడంతో వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ వై.సుధాకర్ ఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. వయస్సు 55 సంవత్సరాల వరకు ఉండవచ్చని, నీలం గడికల్గిన లుంగీ, కట్ బనియన్‌తో ఉన్నట్టు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏఎస్పీ సుస్మితకు టీడీపీ నాయకుల శుభాకాంక్షలు


ఏఎస్పీకి పూల మొక్క అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం ఏఎస్పీగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన సుస్మిత రామనాథన్‌ను టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు టీడీపీ తరపున పోలీసులకు సహకరిస్తామని సీనియర్ నాయకులు పరిమి సత్తిపండు తెలిపారు. రాష్ట్ర క్షత్రియ, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్లు నంబూరి రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ పాతూరి అంబేద్కర్, నాయకులు చెరుకూరి శ్రీధర్, గెడా సుబ్రహ్మణ్యం, ఎన్ని రాంబాబు, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బాలరాజు

టి.నరసాపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి):ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. టి.నరసాపురం మండలంలో బొర్రంపాలెం, సింగరాయపాలెం, మధ్యాహ్నపువారిగూడెంలో ఇటీవల మొంథా తుపాన్‌కు గురైన 326 మత్స్యకార కుటుంబాలకు నిత్యవసరాలను బుధవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం పాలన సాగిస్తోందన్నారు. శీలం వెంకటేశ్వరరావు, జయ్యవరపు శ్రీరామ్మూర్తి, అడపా నాగరాజు, గండబోయిన శ్రీను ఉన్నారు.

ఆదాయ వనరులను పెంపొందించుకోండి : జడ్పీ సీఈవో



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీహరి


ఏలూరు రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులను పెంపొందించేలా పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కృషి చేయాలని జడ్పీ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీహరి సూచించారు. బుధవారం జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో పంచాయతీల్లో సొంత ఆదాయ వనరుల పెంపుదలపై శిక్షణ కార్యక్రమం జరిగింది.ఆయన పాల్గొని మాట్లాడుతూ పంచాయతీలు కేవలం ఇంటి పన్నులు వసూలు చేయడమే కాదని, ఆదాయ వనరులను సృష్టించాలన్నారు. ప్రతీ పంచాయితీ ప్రభుత్వ గ్రాంట్లపైనే ఆధారపడకుండా స్వయం ప్రతిపత్తితో అభివృద్ధి చెందాలన్నారు. జిల్లా ట్రైనింగ్ మేనేజర్ జి.ప్రసంగిరాజు మాట్లాడుతూ ఈ నెల 11,12 తేదీల్లో సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు సొంత ఆదాయవనరులు పెంపుదలపై ఉమ్మడి జిల్లాలోని 48 మండలాల్లో అవగాహన కల్పించనున్నట్టు తెలిపారు.రిసోర్స్ పర్సన్‌లుగా ఉంగుటూరు ఎంపీడీవో జిఆర్ మనోజ్, పీవీ సత్యనారాయణ, జీడీ శ్రీనివాసరావు, ముత్తయ్య ఫ్యాకల్టీలుగా వ్యవహరించారు. శిక్షణలో 48 మండలాల ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆలయానికి దీపపు కుందుల అందజేత

పోలవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం మండలం బోడిగూడెం గోకుల పారిజాత గిరిపై ఉన్న పద్మావతి అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి పోలవరం మాజీ ఉప సర్పంచ్ మంగిన కొండ కుటుంబం రూ.25 వేల విలువైన దీపపు కుందులు అందించారు. మంగిన కొండ కుమారుడు మంగిన పృథ్వీ కుమార్ రూ.25 వేలతో దీపపు కుందులు కొనుగోలు చేసి ఆలయానికి విరాళంగా ఇచ్చినట్టు ఆలయ నిర్వాహకులు బూరుగు వెంకటేశ్వరరావు తెలిపారు.

ఐటీడీఏ పీవోపై విచారణ జరిపించాలి

బుట్టాయగూడెం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పరిహారం విషయంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ కె.రాములు నాయక్‌పై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. బుధవారం పోలోజు నాగేశ్వరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించగా మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ పాల్గొని మాట్లాడుతూ కుక్కునూరు మండలానికి చెందిన కూటమి నాయకులతో కలిసి పీవో రాములు నాయక్ నిర్వాసితుల నుంచి కమిషన్ రూపంలో దండుకుంటున్నారని, అధికారులు జోక్యం చేసుకోవాలన్నారు.





చోరీ కేసులో నిందితుడి అరెస్టు

కుక్కునూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చీరవల్లి గ్రామంలో పేరంటాలమ్మగుడిలో మంగళవారం సోమవారం రాత్రి జరిగిన దొంగతనం కేసులో పోలీసులు వేగంగా దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. వేలేరుపాడు మండలం కమ్మరగూడెం గ్రామానికి చెందిన కారం సాంబయ్య అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇతడిపై ఇప్పటికే 8 చోరీ కేసులు ఉన్నాయన్నారు.

శేషాచలంపై నేత్రపర్వంగా జ్వాలాతోరణం

ద్వారకాతిరుమల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలంపై క్షేత్రపాలకుడిగా కొలువైన శివదేవుని ఆలయంలో కార్తీకపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం రాత్రి జ్వాలాతోరణం నేత్రపర్వంగా జరిగింది. వరిగడ్డితో తోరణాన్ని తయారు చేసి దాన్ని ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి వెలిగించగా శివయ్య వాహనాన్నిదాని కింద నుంచి ప్రదిక్షిణలను చేయించారు. భక్తుల శివనామస్మరణలు, డోలు, సన్నాయి వాయిద్యాలు, వేదఘోషల నడుమ ఈ ఉత్సవం అట్టహాసంగా జరిగింది.





ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కృషి : చింతమనేని



పెదవేగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమం, అభివృద్ధితో పాటు ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం వంగూరులో చేపట్టిన పారిశుధ్య నిర్వహణ పనులను ఎమ్మెల్యే ప్రభాకర్ బుధవారం పరిశీలించారు. గ్రామ పరిశుభ్రత విషయంలో కూటమి నాయకులు శ్రద్ధ పెట్టాలన్నారు. రహదారుల పక్కన పిచ్చిమొక్కలు లాంటివి పెరగకుండా పనులు చేయించాలని ఆయన వివరించారు. పార్టీ నాయకులు సుంకర భాస్కరరావు, గోపిశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలకు రూ.50 వేలు విరాళం


నగదు అందజేస్తున్న మిల్లుబాబు

దెందులూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులు, వినికిడి లోపం ఉన్నవారి అవసరాల నిమిత్తం బధిరుల పాఠశాలకు దెందులూరు టీడీపీ మండలాధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్(మిల్లుబాబు) రూ.50 వేలు అందించారు. మండలంలోని గోపన్నపాలెం గ్రామం మాజీ సర్పంచ్, మండలాధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు ఈ నగదును ఏలూరులోని దత్తాశ్రమం సమీపంలోని బధిరుల పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా దాత మిల్లుబాబుకు ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.










అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మద్దిపాటి శంకుస్థాపన



ద్వారకాతిరుమల, నవంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని గోపాలపురం ఎమ్మెల్యే మద్ది పాటి వెంకట్రాజు అన్నారు. మండలంలోని బుట్టాయిగూడెం, పి.కన్నా పురం, పంగిడిగూడెం, తిరుమలంపాలెం, రామన్నగూడెం పంచాయ తీల్లో రూ.9.50 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కూటమి నాయ కులతో కలిసి ఎమ్మెల్యే బుధవారం శంకుస్థాపన చేశారు. దేవినేనివారి గూడెంలో గుర్రాల వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి, రావులచెరువు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు చేశారు. మండలంలోని ఐ.ఎస్. జగన్నాథపురంలో కొలువైన లక్ష్మీనారసింహుని ఆలయాభివృద్ధికి కట్టుబడి ఉన్నామన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి సాయం

పెదవేగి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త కుటుంబానికి పార్టీ సభ్యత్వం ద్వారా సమకూరిన బీమా సొమ్మును టీడీపీ నాయకులు మృతుని భార్యకు అందించారు. పెదవేగి మండలం భోగాపురానికి చెందిన మట్టా నాగరాజు ఈ ఏడాది మే 13న రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్‌పై నుంచి పడి మృతి చెందడంతో సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఆ కుటుంబాన్ని ఓదార్చి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కాగా పార్టీ సభ్యత్వం ద్వారా మంజూరైన బీమా సొమ్మును నాయకులు వేగుంట శ్రీనివాసరావు, శ్రీహరి, యరజర్ల శివబాబు, రాజేష్‌లు బుధవారం అందించారు.









నూతన పెన్షన్‌లు పంపిణీ

జంగారెడ్డిగూడెం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ సామాజిక పెన్షన్‌లను బుధవారం టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ దాసరి శ్యామ్ చంద్రశేషుతో కలిసి నాయకులు లబ్ధిదారులకు అందజేశారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన పెన్షన్‌లను నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి శేషు, నాయకులు అందజేశారు. సీఎం చంద్రబాబు నాయుడు, కూటమి నాయకులకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. శేషుతో పాటు మండల రైతు అధ్యక్షులు ఎలికే ప్రసాద్, క్లస్టర్ ఇన్‌చార్జి రాగాని శ్రీను, సొసైటీ డైరెక్టర్ తాళ్లూరి వెంకటేశ్వరరావు, రాగాని రామకృష్ణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.









పెండింగ్ డీఏ విడుదల చేయాలి

నూజివీడు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ డీఏలను తక్షణం విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గోవిందరావు డిమాండ్ చేశారు. నూజివీడులో జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఏల విడుదలతో పాటు పీఆర్సీ కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య, ప్రధాన కార్యదర్శి సోమయాజులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కైకలూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. దానగూడెం, బైపాస్ రోడ్డు, పెద్దమసీదు, మెయిన్‌రోడ్డు, తాలుకా సెంటర్, బస్టాండ్, డిగ్రీ కళాశాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని కోరారు.



నేత్రపర్వం.. నరసింహుడి చక్రస్నానం

ఆగిరిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి కార్తీక బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివారి చక్రస్నానం కన్నుల పండువగా నిర్వహించారు. బుధవారం వరాహ పుష్కరిణి వద్ద మేళతాళాల మధ్య ఉత్సవ మూర్తులను వరాహ పుష్కరణిలో అభిషేకించి చక్రస్నాన ఘట్టాన్ని వైభవంగా నిర్వహించారు. శోభనగిరిపై భక్తులు దీపాలు వెలిగించి కృత్తిక దీపోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. ఆలయ ఈవో సాయి పర్యవేక్షించారు.

రోగులకు సకాలంలో వైద్య సేవలందించాలి



రోగులతో మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శోభ

ముసునూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): రోగులకు సకాలంలో వైద్యసేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారిణి డాక్టర్ శోభ వైద్యులకు సూచించారు. బుధవారం ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ఓపీ, వ్యాక్సిన్ నిల్వ చేసే విధానాన్ని పరిశీలించి వైద్య సేవలపై రోగులను ఆరా తీశారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభ మాట్లాడుతూ చిన్నారులకు సకాలంలో వ్యాక్సిన్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. మాతా శిశు మరణాలు లేకుండా తగు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలు సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, ఆస్పత్రి నిర్వహణపై ఫిర్యాదులు వస్తే సహించనన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

కైకలూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని ఎంపీడీవో ఆర్. రాజబాబు అన్నారు. బుధవారం మండలంలోని ఆచవరం మండల పరిషత్ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థి పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వ సూచనలను తు.చ తప్పకుండా పాటించి గ్రామ సచివాలయాల్లో సత్వర సేవలను ప్రజలకు అందించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. సమయపాలన పాటించాలని, ఆకస్మిక తనిఖీల్లో విధుల్లో లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.



పేకాట క్లబ్‌ను నిలుపుదల చేయాలని ధర్నా

ఆగిరిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరప్పాడు గ్రామ పరిధిలో గల మ్యాంగో రిక్రియేషన్ క్లబ్‌లో ఏర్పాటు చేస్తున్న పేకాట క్లబ్‌ను వెంటనే ఆపివేయాలని జూద నిర్వహణ వ్యతిరేక కమిటీ ధర్నా రెండో రోజుకు చేరింది. మ్యాంగో రిసార్ట్స్‌లో గతంలో మూసివేసిన పేకాట క్లబ్‌ను తిరిగి ఏర్పాటు చేస్తుండటంతో పేకాట క్లబ్‌ను ప్రభుత్వం వెంటనే నిలుపుదల చేయకుంటే ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా క్లబ్ నిర్వాహకులు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు మేరకే 13 ముక్కలాట నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.



తహసీల్దార్ లతీఫ్ పాషాను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

ముదినేపల్లి తహసీల్దార్‌కు సన్మానం

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా స్థాయిలో సైక్లోన్ ఫైటర్ అవార్డును సీఎం చంద్రబాబు నుంచి అందుకున్న ముదినేపల్లి తహసీల్దార్ లతీఫ్ పాషాను టీడీపీ నాయకులు బుధవారం ఘనంగా సత్కరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంగు రవికుమార్, పెదపాలపర్రు సర్పంచ్ గంటా రాకేష్, టీడీపీ, జనసేన నాయకులు గన్నమనేని శివ, పుట్టి లక్ష్మణస్వామి, వేములపల్లి రాజేష్, సోమా ఈశ్వర సత్యనారాయణ, కొరపాటి ప్రవీణ్, జొన్నలగడ్డ వీరస్వామి తదితరులు తహసీల్దార్‌ను సత్కరించారు. తనకు ఈ అవార్డు రావడం వెనుక మండలంలోని అన్ని శాఖల అధికారులు, ప్రజలసహకారం ఉందని, సీఎం నుంచి అవార్డును అందుకోవడం ఆనందంగా ఉందని తహసీల్దార్ లతీఫ్ పాషా అన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ

కైకలూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లకు అలవాటు పడి ఉజ్వల భవిష్యత్తును కోల్పోతున్నారని కైకలూరు టౌన్ సీఐ ఏవీఎస్ రామకృష్ణ అన్నారు. బుధవారం కైకలూ రు ఓరియంటల్ హైస్కూల్లో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సైబర్ నేరాలు, పోక్సో, ర్యాగింగ్ అలాగే మైనర్ డ్రైవింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండకుండా బైక్ నడిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. విద్యార్థులు ఆటలపట్ల మక్కువ చూపాలన్నారు టౌన్ ఎస్సై ఆర్ శ్రీను, హెచ్ఎం కట్టా విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఫర్నిచర్ సర్దుబాటు

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నూతన బడుల వ్యవస్థలో డిగ్రేడ్ అయిన ఎంపీయూపీ పాఠ శాలల్లోని మిగులు ఫర్నిచర్, ఎలక్ట్రానిక్ పరికరాలను మండలంలో అవసరమైన హైస్కూళ్ళకు తరలించాలని డీఈవో వెంకట లక్ష్మి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మండలంలో డిగ్రేడ్ అయిన దేవపూడి, వణుదుర్రు, కొరగుంటపాలెం, చినకామనపూడి, చేవూ రు, కాకరవాడ, దాకరం, వాడవల్లి యూపీ పాఠశాలల నుంచి కొత్తగా ఏర్పాటైన వైవాక, సింగరాయపాలెం హైస్కూళ్ళకు సర్దుబాటు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

తొలగని డెక్క... కదలని వరద

లంక గ్రామాల ప్రజల పాట్లు



పెదఎడ్లగాడి వద్ద కొల్లేరు నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిన గుర్రపుడెక్క, తూడు

మండవల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొల్లేటి నీటి ప్రవాహానికి పెదఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్క, తూడు దట్టంగా అలుముకున్న తొలగించే నాథుడే కరువయ్యాడు. ఎగువ నుంచి పలు డ్రెయిన్ల ద్వారా కొల్లేరుకు వరదనీరు చేరుతున్నప్పటికీ కొల్లేటి లంక గ్రామాలు ముంపు నీటిలో మగ్గుతున్నా నీరు దిగువకు మళ్లింపు చర్యలు కానరావడం లేదు. నెల రోజుల కిందట కురిసిన భారీ వర్షాలకు కొల్లేరుకు వరద ముంపు ఏర్పడడంతో పెద్దఎడ్లగాడి వద్ద ఎక్స్‌కవేటర్లను పెట్టి గుర్రపుడెక్కను తొలగించే పనులు చేపట్టారు. అప్పట్లో వరద నీరు తగ్గడంతో గుర్రపుడెక్క పూర్తిస్థాయిలో తొలగించే పనులకు స్వస్తి చెప్పి అధికారులు కనుమరుగయ్యారు. మరలా తుపాన్ బీభత్సంతో వరదనీరు కొల్లేరుకు చేరడంతో మళ్లీ ముంపు పరిస్థితి ఏర్పడింది. పెద్దఎడ్లగాడి, చినఎడ్లగాడి వద్ద గుర్రపుడెక్క దట్టంగా అలుముకు పోయింది. దిగువకు చుక్క నీరు కూడా ప్రవహించకుండా అడ్డుకట్టలా నిలిచింది. దీంతో ఎగువ నుంచి వచ్చిన నీరు దిగువకు వెళ్లే మార్గం లేక కొల్లేటి లంక గ్రామాల్లోని రహదారులపై ప్రవహిస్తూ ముంపు సమస్యకు కారణం అవుతున్నా ఎవరూ కన్నెత్తి చూడకపోవడంతో లంక గ్రామాల ప్రజలు జీవన శైలి అగమ్యగోచరంగా మారింది. గత 23 రోజుల నుంచి పెద్దఎడ్లగాడి పెనుమాకలంక రోడ్డు కొల్లేటి నీటిలో ముంపునకు గురై రాకపోకలు లేక పడవ ప్రయాణంతో ప్రజలు జీవనం సాగిస్తున్నారు. పెదఎడ్లగాడి, చినఎడ్లగాడి వద్ద పెరిగిన తూడు, గుర్రపు డెక్కను తొలగిస్తే కొల్లేటి లంక గ్రామాలు ముంపు నుంచి తేరుకుంటాయని చెబుతున్నారు. అధికారులు, నాయకులు కొల్లేరులో నీటి ప్రవాహానికి అవరోధంగా ఉన్న గుర్రపుడెక్క, తూడు తొలగింపు పనులు చేపట్టాలని కొల్లేటిలంక గ్రామస్థులు కోరుతున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి హుండీల ఆదాయం లెక్కింపు

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటరులోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీల లెక్కింపు జరిగింది. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. గంగా శ్రీదేవి, భీమవరం మావుళ్ళమ్మ దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బి. మహాలక్ష్మి పర్యవేక్షణలో జరిగిన లెక్కింపులో గడచిన 134 రోజులకు రూ. 15.54 లక్షల నగదు, 750 గ్రాముల వెండి, 2.5 మిల్లీ గ్రాముల బంగారం లభించింది. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మకర తోరణాల బహూకరణ

మండవల్లి: మండలంలోని లోకుమూడి అయ్యప్ప స్వామి ఆలయానికి భక్తుడు ఇత్తడి మకర తోరణాలు బహూకరించారు. ఆలయంలో వినాయక, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్లకు కందుబోతు శ్రీనివాస్‌స్వామి రూ.30వేల విలువ గల మకర తోరణాలు చేయించారు. దాత శ్రీనివాస్ బుధవారం ఆలయ గురుస్వామి అప్పారావుకు మకరతోరణాలను అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు నెలాఖరులోగా పూర్తిచేయాలి

చాట్రాయి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తి చేయని లబ్ధిదారులు వచ్చే నెలాఖరులోగా పూర్తి చేసుకోవాలని లేని పక్షంలో ఇంటి మంజూరు రద్దు అవుతుందని చనుబండ సొసైటీ చైర్మన్ మోరంపూడి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం ఉదయం చనుబండ సచివాయం-1 వద్ద కాలనీ ఇళ్ల లబ్ధిదారులకు డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరరావు అధ్యక్షతన అవగాహనా సదస్సు నిర్వహించారు. డీటీ మాట్లాడుతూ చనుబండ పంచాయతీలోని మూడు లేఅవుట్ కాలనీలలో లబ్ధిదారులు సత్వరమే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని ఆదేశించారు. కృష్ణారావు పాలెం సర్పంచ్ పుల్లారావు, ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, నక్కా రాము, వీఆర్‌వో శోభన్‌బాబు, హౌసింగ్ వర్క్ ఇన్స్పెక్టర్ విజయ్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దివ్య, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులపై జగన్‌ది కపట ప్రేమ

- అసత్యాలను ప్రచారం చేస్తున్నారు
- మంత్రి పార్థసారథి
- పంట నష్టం పరిశీలనకు వైసీపీ నాయకులు రావాలని సవాల్



నూజివీడులో ట్రైసైకిళ్లు పంపిణీ చేస్తున్న మంత్రి

నూజివీడు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలను ప్రచారం చేయడం అలవాటుగా పెట్టుకున్న పులివెందుల ఎమ్మెల్యే జగన్మోహన్‌రెడ్డి, ఆయన అనుచర గణం రైతుల పట్ల కపట ప్రేమ చూపుతున్నారని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి పార్థసారథి విమర్శించారు. బుధవారం తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ వల్ల నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామన్నారు. తుఫాన్‌కు ముందు, తరువాత కూడా అధికార యంత్రాంగం ఎంతో చిత్తశుద్ధితో పనిచేసిందన్నారు. మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో 1,63,366 హెక్టార్లలో పంట నష్టం జరిగిందన్నారు. అయితే 15 లక్షల ఎకరాల్లో నష్టం జరిగిందని, ప్రభుత్వం నష్టాన్ని తక్కువ చేసి చూపిస్తోందని వైసీపీ విషం చిమ్ముతోందని, వైసీపీ నాయకులు 10 మంది, కూటమి నుంచి తాను, మరో పది మంది నాయకులు రాష్ట్రంలో పర్యటించి పంట నష్టాలను పరిశీలిస్తామని, తమ ప్రభుత్వం చెప్పిన లెక్కలు తప్పు అని రుజువైతే తాము దేనికైనా సిద్ధమని, వైసీపీ వాళ్ళు చెప్పింది తప్పయితే కనీసం క్షమాపణ చెప్పాలని మంత్రి వైసీపీ నాయకులకు సవాల్ విసిరారు. గత వైసీపీ ప్రభుత్వం పంటల బీమా చెల్లించకుండా రైతులను మోసం చేసిందన్నారు.

దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ

దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని మంత్రి పార్థసారథి అన్నారు. నూజివీడులోని క్యాంపు కార్యాలయంలో బుధవారం 24 మంది దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిల్స్‌ను ఆయన అందజేసి మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులందరికీ ఉపకరణాలు, పింఛన్లు అందిస్తున్నామని, ఇంకా అర్హులుంటే ఎంపీడీవో కార్యాలయంలో గానీ, సచివాలయంలో గాని దరఖాస్తులు ఇవ్వాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ముసునూరు: మండలంలోని పలు గ్రామాలకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ. 8 లక్షల 6వేలు విలువగల సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి తన క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు.

'బాల్య వివాహాలు అరికట్టాలి'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీడీపీవో విజయకుమారి

ఆగిరిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై అవగాహన పెంచుకుని వాటిని అరికట్టాలని నూజివీడు సీడీపీవో పి. విజయకుమారి అన్నారు. బుధవారం స్థానిక మండల కార్యాలయంలో సీడీపీవో ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడుతూ యువతులకు 18, యువకులకు 21 సంవత్సరాల లోపు వివాహం చేస్తే దాన్ని బాల్య వివాహం కింద పరిగణించవచ్చునన్నారు. బాల్య వివాహం వల్ల పుట్టబోయే బిడ్డకు, తల్లికి ప్రాణ హాని ఉంటుందన్నారు. ఏవో అబ్దుల్ సలాం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు జి. రాగమయి, జి. రాజ్యలక్ష్మి, ఆశా వర్కర్లు, సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

ముసునూరు: బాల్య వివాహాలను నియం త్రణకు అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో ఏసుబాబు అన్నారు. బుధవారం మండల కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, అంగన్‌వాడీలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ టీనేజ్ ప్రెగ్నెన్సీలు పెరగకుండా చర్యలు తీసుకో వాలన్నారు. అలాగే కిశోర బాలికలకు చట్టాల ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచాలన్నారు. గ్రామస్థాయిలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి రెండో శుక్రవారం సచివాలయాల్లో, ప్రతి మూడో శుక్రవారం మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. తహసీల్దార్ ప్రశాంతి, ఎంఈవో సుబ్బారావు, డాక్టర్ ఇవాంజలి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



శ్రీశ్యామలాంబ ఆలయంలో జ్వాలాతోరణం



వీరభద్రస్వామి ఆలయానికి వెళ్తున్న మంత్రి సారథి



చాట్రాయిలో కార్తీక దీపాలంకరణ

ఆరనీకుమా ఈ దీపం..

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి పూజలు



బలివేలో శివయ్య



బలివేలో లక్ష దీపోత్సవం



ముదినేపల్లి పెదరామాలయంలో దీపాలంకరణ

కైకలూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. కైకలూరు శ్రీశ్యామలాంబ ఆలయంలోని పార్వతీసమేత రామలింగేశ్వర, రామేశ్వర, కనక లింగేశ్వరస్వామి వార్లను దర్శించుకుని ఆలయంలో దీపాలను వెలిగించారు. స్వామివార్లకు రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన జరిగాయి. రాత్రికి జ్వాలాతోరణం, శిఖర దీపారాధన హరి భాస్కరశర్మ నిర్వహించారు. ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. కైకలూరు చిన్న చెరువు గట్టుపై గల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మహిళలు లక్ష ఒత్తుల పూజ నిర్వహించారు.

ముసునూరు: కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం నాడు మండల వ్యాప్తంగా ఉన్న శివాలయాలు భక్తులతో కిటకిటలా డాయి. బలివే శ్రీ రామలింగేశ్వరస్వామికి ఆలయ ప్రధాన అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి భక్తులు తమ్మిలేరులో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు. ఆలయంలో ఏర్పాట్లును దేవదాయ, ధర్మదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ కూచిపూడి శ్రీనివాస రావు పరిశీలించారు. నూజివీడు సీఐ రామకృష్ణ, ఎస్ఐ ఎం.చిరంజీవి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయ చైర్మన్ శ్యామలరావు, ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది.

కలిదిండి: దక్షిణ కాశీగా పేరొందిన కలిదిండి పాతాళ భోగేశ్వరస్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచి భక్తులు స్వామివారికి పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఇంకా మండలంలోని పలు ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. గ్రూపు దేవాలయాల ఈవో శేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముదినేపల్లి: పలు శివాలయాల్లో కార్తీక పౌర్ణమి పూజలు, జ్వాలా తోరణం నిర్వహించారు. అల్లూరులో సోమేశ్వరస్వామిని విశేషంగా అలంకరించి ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకుడు సుబ్బరాయ శర్మ అభిషేకాలు చేశారు. ముదినేపల్లి పెద రామాలయంలో మహిళలు కార్తీక దీపాలంకరణ చేశారు.

మండవల్లి: మండవల్లి, భైరవపట్నం శివారు శోభనాద్రిపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో తెల్లవారుజాము నుంచి భక్తులు దీపాలను వెలిగించారు. భక్తులు శివుడికి పాలు, పంచామృతాలతో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు చేశారు.

వీరభద్రస్వామి కల్యాణోత్సవంలో మంత్రి

నూజివీడు టౌన్: బుధవారం సుంకొల్లులో వీరభద్రస్వామి కల్యాణోత్సవంలో మంత్రి సారథి పాల్గొన్నారు. ఆలయ అభివృద్ధికి రూ. 15 లక్షలతో చర్యలు చేపడతానన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. నూజివీడు దుర్గా మల్లేశ్వరస్వామి, కోట శివాలయాల్లో అభిషేకాలు దేవదాయ, ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు.

చాట్రాయి: చాట్రాయి కోదండ రామాలయంలో స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. సాయంత్రం కార్తీక దీపోత్సవం జరిగింది. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సమారోహాలు, హోమాలు, వేదపారాయణ నిర్వహించగా, ఆలయ అర్చకులు కార్తీక మాసం విశిష్టతను భక్తులకు వివరించారు.

బురద తొలగించాలని ధర్నా

కలిదిండి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సిమెంట్ రోడ్లపై బురద తొలగించి డ్రెయినేజీలను ఏర్పాటు చేయాలని కోరుతూ బుధవారం సానారుద్రవరంలో సీపీఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్గత రహదారులు బురదకయ్యగా మారటంతో విద్యార్థులు, రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రెయినేజీలు పూడుకు పోవటంతో కొద్దిపాటి వర్షానికే రహదారులు చెరువులను తలపిస్తున్నాయన్నారు. సీపీఎం నాయకులు జక్కుల మహేష్, గొల్ల వెంకట రత్నం, బిరుదుగడ్డ భానుప్రకాష్, జక్కుల నాగేశ్వరరావు, దాసరి లాజరు గ్రామస్థులు పాల్గొన్నారు.



కలపను పరిశీలిస్తున్న ఎంపీడీవో రాఘవేంద్రనాథ్

నేడు దుంగల బహిరంగ వేలం

నూజివీడు టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెట్ల దుంగల బహిరంగ వేలం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో చెన్న రాఘవేంద్రనాథ్ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ ప్రభుత్వ నిబం ధనల మేరకు బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు. పాటలో పాల్గొనే ఔత్సాహికులు రూ. 20 వేలు ధరావతు చెల్లించవలసి ఉంటుందన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ. 1.61 లక్షలకు పైగా వేలం పాడిన వారికి చెట్ల దుంగలను అందిస్తామన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే తక్కువగా వేలం కొనసాగినా, నిబంధనల మేరకు కొనసాగకపోయినా బహిరంగ వేలం పాట రద్దు చేసే హక్కు ఎంపీడీవోకి ఉంటుందన్నారు.

సబ్సిడీపై మినుము విత్తనాలు

కలిదిండి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దాళ్వాలో రైతులు మినుము సాగు చేయాలని మండల వ్యవసాయాధికారి విద్యాసాగర్ అన్నారు. బుధవారం కోరుకొల్లు, కొచ్చెర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై మినుము విత్తనాలను త్వరలో పంపిణీ చేస్తామన్నారు. మొంథా తుఫాన్ కారణంగా ముంపు బారిన పడిన పంట అంచనాలను తయారు చేస్తున్నామన్నారు.



వైశ్య ఫెడరేషన్ వైస్ చైర్మన్‌గా వత్తుమిల్లి

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర శాఖ వైస్ చైర్మన్‌గా ముదినేపల్లికి చెందిన రాష్ట్ర వాసవీ సేవాదళ్ కార్యదర్శి వత్తుమిల్లి వీర వెంకట సత్య వరప్రసాద్ నియమితులయ్యారు. ఆయనకు నియామకపత్రాన్ని బుధవారం విజయవాడలో ఫెడరేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దూండి రాకేష్, అధ్యక్షుడు కోనా శ్రీనివాసరావు అందజేశారు. ఫెడరేషన్ కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానని ప్రసాద్ తెలిపారు. ఫెడరేషన్ రాష్ట్ర నాయకులు గొంట్లా రామమోహనరావు, వెంట్రప్రగడ వీరాంజనేయులు ప్రసాద్‌ను అభినందించారు.

పంట కాల్వలో ఆటో బోల్తా

ముదినేపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గుడివాడ నుంచి కలిదిండి కిరాణా సరుకులతో కిరాయికి వెళుతున్న ఆటో బుధవారం సాయంత్రం ముదినేపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే ఉన్న పంట కాల్వలో బోల్తా పడింది. పోల్‌రాజ్ డ్రైన్ సమీపంలోకి రాగానే ఆటో అదుపు తప్పి బోల్తాపడిన ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108లో గుడివాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోలోని సరుకులు చాలా వరకు కాల్వలో పడిపోయాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాటల్లో పెట్టి.. రూ. 2.30 లక్షల అపహరణ

కైకలూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బ్యాంకు తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించేందుకు తీసుకు వెళుతున్న రూ.2.30 లక్షలు ఆగంతుకులు అపహరించిన ఘటనపై కైకలూరు టౌన్ ఎస్సై ఆర్. శ్రీను కేసు నమోదు చేశారు. బుధవారం తామరకొల్లు గ్రామానికి చెందిన పోకల చంద్రరావు కైకలూరు యూనియన్ బ్యాంకులో రూ.2.30 లక్షలు డ్రా చేసి మరో బ్యాంకులో తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించేందుకు తన బైకు ఎదురు భాగంలో నగదును ఉంచాడు. ఆ సమయంలో ఇద్దరు యువకులు వేర్వేరుగా ద్విచక్ర వాహనాలపై వచ్చి చంద్రరావుతో మాట కలిపి ఆతనికి తెలియకుండా సొమ్ము కాజేశారు. అనంతరం అతను సొమ్ము పోయినట్టు గుర్తించి బిగ్గరగా కేకలు వేశాడు. అప్పటికే వారు పరారయ్యారు. బాధితుడు కైకలూరు టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా విచారణ ప్రారంభించారు.

బడ్డీ కొట్లో చోరీ

ఆగిరిపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండ్ సమీపంలోని కావూరి బడ్డీ కొట్టులో మంగళ వారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు తాళాలు పగులగొట్టి లోపల ఉన్న రూ.8 వేలు నగదు, సుమారు రూ.10వేల విలువగల సిగరెట్లు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభశేఖర్ తెలిపారు.